*పత్రికా ప్రకటన - 1*

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 15.07.2014

తెలంగాణలో పరిశ్రమల స్థాపన కోసం ప్రపంచ వ్యాప్తంగా వున్న పెట్టుబడుదారులు పరుగులు పెట్టుకుంటూ హైదరాబాద్‌లో వాలే అత్యుత్తమ పారిశ్రామిక విధానాన్ని తెస్తున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చెప్పారు.

సచివాలయంలో మంగళవారం పారిశ్రామిక విధాన రూపకల్పనపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతంగా పారిశ్రామిక విధానాన్ని అమలు చేస్తున్న సింగపూర్ లాంటి దేశాల విధానాలను అధ్యయనం చేయాలని మెరుగైన విధానాన్ని తెలంగాణలో ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడిదారులకు ప్రోత్సహకరంగా వుండే విధంగా సింగిల్ విండో విధానాన్ని ప్రవేశ పెట్టనున్నట్లు, దేశంలో మరే రాష్ట్రంలోను లేనంత సులభంగా, సరళంగా, పారదర్శకంగా, అవినీతి రహితంగా సింగిల్ విండో విధానం వుంటుందని వెల్లడించారు. పరిశ్రమల స్థాపనకు వచ్చిన పెట్టుబడిదారులు దరఖాస్తు చేసుకున్న రెండు వారాలలోనే అన్ని రకాల అనుమతులు పొందే విధంగా సింగిల్‌విండో వ్యవస్థ పనిచేయాలని, ముఖ్యమంత్రి కార్యాలయంలోనే ఇందు కోసం చేజింగ్ సెల్ ఏర్పాటు చేస్తామని సిఎం వెల్లడించారు. పరిశ్రమల స్థాపనకు ఇప్పుడు అనుమతులు తెచ్చుకునే విధానం లోపభూయిష్టంగా వుందని, 17 శాఖల నుండి దాదాపు 22 అనుమతులు తెచ్చుకోవడం ఇబ్బందికరంగా మారిందని సిఎం అభిప్రాయపడ్డారు. దీనికి బదులుగా పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ అందుబాటులో వున్న భూమిని ఇండస్ట్రియల్ పార్కులుగా మార్చి, అన్ని అనుమతులు పొంది, పరిశ్రమలకు అనువుగా తయారు చేయాలని సూచించారు. తెలంగాణ వ్యాప్తంగా వ్యవసాయానికి ఉపయోగపడని భూములన్నింటిని టిఎస్ఐఐసికి కేటాయించి, ఎ పరిశ్రమకు ఎంత భూమి అవసరం, ఎక్కడ కేటాయించాలి అనే అంశాలపై కూడా టిఎస్ఐఐసి నిర్ణయం తీసుకునే అంశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. సాగునీటి ప్రాజెక్టులలో పదిశాతం నీటిని పరిశ్రమలకు కేటాయించే విధంగా చట్టం చేస్తామని వెల్లడించారు.

అన్ని పరిశ్రమలు ఒకే దగ్గర కేంద్రీకృతం కాకుండా తెలంగాణ వ్యాప్తంగా పరిశ్రమలు వచ్చేటట్లు చూడాలని, ఒ చోట ఫార్మా సిటీ, మరో చోట టెక్స్టైల్ పార్క్, ఇంకో చోట పేయింటింగ్ పరిశ్రమ ఇలా ఒక్కోటి ఒక్కో చోట వుండాలని దాని వల్ల ఉపాధి, ఉద్యోగావకాశాలు అన్ని ప్రాంతాలకు దక్కుతాయని ముఖ్యమంత్రి చెప్పారు. పారిశ్రామిక విధానానికి తుది రూపం ఇచ్చే ముందు ఫిక్కి, ఫ్యాప్సి, ఐఐసి లాంటి సంస్థల ప్రతినిధులతో కూడా సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. మూడు నాలుగు రోజులలోనే ఈ సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరిశ్రమల స్థాపనతో పాటు వృత్తి నైపుణ్యాన్ని పెంచే విషయంలో కూడా శ్రద్ధ చూపాల్సిన అవసరం వుందని, పారిశ్రామికీకరణను గ్రామీణులు కూడా అందిపుచ్చుకునే విధంగా ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

తెలంగాణలో రెండవ అతిపెద్ద నగరమైన వరంగల్‌ను పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయడం తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని కేసిఆర్ ప్రకటించారు. దక్షిణ భారతదేశంలోనే పత్తి పంట వరంగల్ జిల్లాలో ఎక్కువగా పండుతుందని, కాబట్టి వరంగల్‌లో టెక్స్టైల్ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. అజాంజాహి మిల్లుకు సంబంధించిన భూమి కొంత అందుబాటులో వుందని మరికొంత భూమిని కూడా సేకరించి రెండు వేల ఎకరాలలో తమిళనాడులోని తిర్పూర్ తరహాలో టెక్స్టైల్ పార్క్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇదే జిల్లాలోని వరంగల్, ఖమ్మం సరిహద్దుల్లో బయ్యారం, మహబూబాబాద్ మండలాలల్లో విస్తరించిన ఇనుప ఖనిజ నిక్షేపాలను సంపూర్ణంగా వినియోగించుకొనేందుకు ఉక్కు పరిశ్రమ ప్రారంభిస్తామని చెప్పారు. 30 వేల కోట్లతో వరంగల్, ఖమ్మం సరిహద్దుల్లో ఉక్కు పరిశ్రమ స్థాపించేందుకు స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు. వరంగల్‌లో విమానాశ్రయం, రైలు మార్గం, హైదరాబాద్ నుండి కేవలం గంట 10 నిమిషాల్లో చేరుకునే రోడ్డు మార్గం, నీటి వసతి అందుబాటులో వున్నాయని వీటిని వినియోగించుకొని అక్కడ పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చెప్పారు. హైదరాబాద్ - వరంగల్‌ను ఇండస్ట్రియల్ కారిడార్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

---

**సిపిఆర్ఓ టు సిఎం**